నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్, బుధవారం 26 జూన్ 2024 | ADILABAD NIRMAL


# గ్రామస్తులు సంయమనం పాటించండి

● సర్వే చేసి త్వరలో సమస్య పరిష్కరిస్తాం.. ● భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్ రెడ్డి

లోకేశ్వరం, జూన్ 25 : గ్రామస్తులు గొడవలకు దిగకుండా సంయమనం పాటించాలని భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన లోకేశ్వరం మండలంలోని గడ్‌చాంద సమీపంలోని ఎస్సారెస్పీలో ముంపునకు గురైన వివాదాస్పద భూములను పరిశీలించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపునకు గురయ్యే భూములకు నష్టపరిహారం తీసుకున్న కొంత మంది రైతులు మళ్లీ వాటిలో పంటలు వేయడమే గాకుండా క్రయ, విక్రయాలు జరుపుతున్నారని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం భైంసా ఆర్డీవో ఆ భూములను పరిశీలించారు. వెంటనే ఆయన ఎస్సారెస్పీ అధికారులతో ఫోన్‌లో సంప్రదించి వీలైనంత త్వరలో సర్వే నిర్వహించాలని, ప్రభుత్వం తీసుకున్న భూములు ఉన్నట్లు తేలితే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

# నాణ్యమైన విద్య అందించండి

ఎమ్మెల్యే అనిల్ జాదవ్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్, జూన్ 25 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెను ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని సూచించారు. వర్షాకాలం ఆహార పదార్థాల వద్ద నీరు నిలువలేకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశుభ్రతగా ఉంచాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు.

# రూ.15 వేలు ఇవ్వాలి

## పదెకరాలు పైబడిన వారికి అందించాలి..

● నిబంధనల పేరిట దూరం చేయవద్దు ● రేషన్ కార్డు నిబంధన విధించవద్దు.. ● కేసీఆర్ మాదిరిగా సరైన సమయంలో అందించాలి.. ● రైతువేదికల్లో వ్యవసాయశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్

● అభిప్రాయాలను వెల్లడించిన పలువురు రైతులు ● అందరికీ మాట్లాడే అవకాశం రాకపోవడంపై ఆగ్రహం ● నామమాత్రంగా నిర్వహణ.. అధికంగా అధికారులు, సిబ్బంది హాజరు

ఆదిలాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ) : ''అర్హులైన రైతులందరికీ ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలి. పదెకరాలు పైబడిన రైతులకు, ఆర్‌వోఎఫ్‌ఆర్(అటవీ భూములు) పట్టాలు కలిగి ఉన్న పదెకరాలలోపు గిరిజనులకు రైతుభరోసా ఇవ్వాలి. ఇచ్చే డబ్బులను కేసీఆర్ మాదిరిగా సాగుకు ముందే ఇస్తే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవడం సులభం అవుతుంది. గతంలో మాదిరిగా విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలి. రేషన్ కార్డు నిబంధన విధించవద్దు. పట్టా పాసు పుస్తకం ఉన్న వారికి సాయం అందించాలి.'' అని రైతులు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం రైతు భరోసా పథకం అమలులో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతువేదికల్లో రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

### నామమాత్రంగా నిర్వహణ

ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జైనథ్.. బోథ్ నియోజకవర్గానికి సంబంధించి బోథ్, ఇచ్చోడ.. ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి ఇంద్రవెల్లి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్(వీసీ)లు ఏర్పాటు చేశారు. అన్ని వీడియో కాన్ఫరెన్స్‌లు కూడా నామమాత్రంగా కొనసాగాయి. జైనథ్‌లో నిర్వహించిన వీసీకి జైనథ్, బేల, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబార్ రూరల్, మావల మండలాలకు చెందిన రైతులు హాజరుకావాల్సి ఉండగా జైనథ్, బేల మండలాల రైతులు మాత్రమే కనిపించారు. ఇంద్రవెల్లిలో నిర్వహించిన వీసీలో ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్ మండలాలకు చెందిన రైతులు పాల్గొనాల్సి ఉండగా.. ఇంద్రవెల్లి రైతులు ఉన్నారు. బోథ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ మండలాల రైతుల హాజరుకావాల్సి ఉండగా.. కేవలం స్థానిక రైతులు కనిపించారు. ఇచ్చోడలో నిర్వహించిన వీసీలో ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల రైతులు రావాల్సి ఉండగా చుట్టు పక్కల రెండు మండలాల రైతులు వచ్చారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల నుంచి సలహాలు, సూచనలు సేకరించాల్సి ఉండగా.. ప్రతి నియోజకవర్గంలో ఒక్కో రైతుకు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. ఇచ్చోడలో అసలు మాట్లాడే అవకాశం రాలేదు. దీంతో అక్కడి వచ్చిన అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇంద్రవెల్లిలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో రైతులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

### సీజన్‌కు ముందే వేయాలి..



ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరానికి రూ.15 వేల సాయం అమలు చేయాలి. సాగులో ఉండి, 10 ఎకరాల పైబడి ఉన్న రైతులకే ఇవ్వాలి. యేటా వానకాలం, యాసంగి సీజన్‌కు ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. దీంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సరైన సమయంలో విత్తనాలు నాటే అవకాశం కలుగుతుంది. రైతులందరికీ రేషన్‌కార్డులు లేనందున ఆహారభద్రత కార్డు నిబంధనలు పెట్టవద్దు. పట్టాపాసు పుస్తకం ఉన్న రైతులకు పథకం వర్తింపచేయాలి.

- గణేశ్ యాదవ్, రైతు, జైనథ్, ఆదిలాబాద్

### అర్హులందరికీ అందించాలి..



ఇచ్చోడ, జూన్ 25 : కేసీఆర్ ప్రభుత్వం ప్రతి రైతుకు భూమితో సంబంధం లేకుండా ఎన్ని ఎకరాలున్న రైతుబంధు ఇచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం కోసం విధి విధానాలు, పరిమితులు పెడుతున్నది. వ్యవసాయ భూములను లేవుట్ భూములు, రియల్ ఎస్టేట్స్ భూములను కట్ చేసి సాగు చేస్తున్న రైతుకు భూమితో సంబంధం లేకుండా అందించాలి.

- సోందావాడే నారాయణ, సోంపెల్లి, సిరికొండ మండలం

### షరతులు లేకుండా చూడాలి..



కడెం, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి. ఇన్ని ఎకరాల వరకు లిమిట్ అని కాకుండా ఇవ్వాలి. కేసీఆర్ తీసుకొచ్చిన పెట్టుబడుల సహాయంతోనే చాలా మంది వలసలు మాని, స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో షరతులతో కూడిన భరోసా అంటే రైతులు తిరిగి వలస బాట పట్టే ప్రమాదం ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే రైతులకు భరోసా ఇవ్వాలి.

- దానవేణి రవి, రైతు, పెద్దూర్, కడెం మండలం.

### పని ముట్లను సబ్సిడీపై ఇయ్యాలె..



బోథ్, జూన్ 25 : పదెకరాలు పైబడిన రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేయాలి. అలాగే ఆర్‌వోఎఫ్‌ఆర్(అటవీ భూములు) పట్టాలు కలిగి ఉన్న గిరిజన పదెకరాలలోపు రైతులకు కూడా ఇవ్వాలి. ఈ సహాయాన్ని విత్తనాలు వేసే సమయంలో అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో మాదిరిగా విత్తనాలు సబ్సిడీపై అందిస్తే బాగుంటుంది. వ్యవసాయ పనిముట్లను కూడా సబ్సిడీపై అందించాలి.

- ఇదాపు రాకేశ్, రైతు, కన్గుట్ట, బోథ్ మండలం.

### రైతు భరోసా త్వరగా ఇవ్వాలి..



ఇచ్చోడ, జూన్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రతి రైతుకు సీజన్‌కు ఎకరాకు రైతుభరోసా కింద రూ.7,500 ఇస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలం మొదలైన సందర్భంగా విత్తనాలు తదితర ఖర్చుల కోసం త్వరగా రైతుభరోసా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. భూ పరిమితి లేకుండా ప్రతి రైతుకు గత ప్రభుత్వం ఇచ్చినట్లు రైతు భరోసా అందజేయాలి.

- సిడాం జైవంత్‌రావ్, బాదిగూడ, ఇచ్చోడ మండలం





రిమ్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఎదుట జూనియర్ వైద్యుల ఆందోళన

# ఆందోళన ఉధృతం

## రెండో రోజు కొనసాగిన జూనియర్ డాక్టర్ల సమ్మె

ఆదిలాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ) : తమ సమస్యలను పరిష్కరించాలంటూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. మంగళవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఎదుట జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం రెండు నెలల కిందట సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఎన్నికల కారణంగా వాయిదా వేసిందని తెలిపారు. రెండు రోజుల కిందట జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపిన ప్రభుత్వం పూర్తి డిమాండ్లను అంగీకరించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లకు ప్రతినెల ఉపకార వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, ఆసుపత్రుల్లో కనీస వసతులు లేవని, సరైన భద్రత లేకపోవడంతో దాడులు జరుగుతున్నాయన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సూచనల మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో జూనియర్ డాక్టర్లకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. తమ డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతున్నదని తెలిపారు.

### సమస్యలను పరిష్కరించాలి..



జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. సోమవారం జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపిన ప్రభుత్వం కొన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించింది. విధులు నిర్వహిస్తున్న తమపై దాడులను అరికట్టడానికి సెక్యూరిటీని పెంచడం, ఆసుపత్రుల్లో వైద్యులకు కనీస సౌకర్యాల కల్పన, కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి. అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుంది.

- సందీప్ చారి, అధ్యక్షుడు, జూనియర్ వైద్యుల సంఘం, రిమ్స్.

### కనీస సౌకర్యాలు కల్పించాలి..



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేక జూనియర్ డాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. విధులు నిర్వహించే మాకు గదుల కొరత, తాగునీరు, ఇతర సమస్యలు ఉన్నాయి. సరైన భద్రత సిబ్బంది లేకపోవడంతో దాడుల విషయంలో భయపడాల్సి వస్తుంది. భద్రతా సిబ్బందిని నియమించాలి. ఆసుపత్రులకు సరైన మందులు, వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మౌనిక, జూనియర్ డాక్టర్, రిమ్స్

### ఎన్ఎంసీ సూచనలు అమలు చేయాలి..



ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లకు సంబంధించిన జాతీయ వైద్య మండలి సూచనలు ప్రభుత్వం అమలు చేయాలి. వైద్యులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. వైద్యశాలల్లో కనీస సౌకర్యాలు లేక జూనియర్ డాక్టర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. హాస్టల్ సౌకర్యం లేక కిరాయి రూంలలో ఉంటున్నారు. డాక్టర్స్‌పై దాడులు జరగకుండా గత ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం భద్రతను పెంచాలి.

- అరుణ్, జూనియర్ డాక్టర్, రిమ్స్

**చేరిన విద్యార్థులు**

| మండలం | గతేడాది | ఈ యేడాది |
|---|---|---|
| కుభీర్ | 167 | 13 |
| తానూర్ | 303 | 144 |
| బాసర | 80 | 140 |
| ముథోల్ | 216 | 82 |
| భైంసా | 372 | 256 |
| కుంటాల | 154 | 16 |
| నర్సాపూర్(జి) | 163 | 35 |
| లోకేశ్వరం | 166 | 115 |
| దిలావర్‌పూర్ | 199 | 64 |
| సారంగాపూర్ | 367 | 180 |
| నిర్మల్ | 176 | 7 |
| నిర్మల్ రూరల్ | 174 | 14 |
| సోన్ | 118 | 253 |
| లక్ష్మణచాంద | 127 | 48 |
| మామడ | 231 | 75 |
| పెంబి | 99 | 97 |
| ఖానాపూర్ | 281 | 22 |
| కడెం | 173 | 75 |
| దస్తురాబాద్ | 96 | 5 |
| మొత్తం | 3,661 | 1,641 |





బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

# ఇదేం బడిబాట

● గతేడాది 3,661 మంది.. ఈ యేడాది 1,641 మంది చేరిక

● సగానికి తగ్గిన నమోదు.. దస్తురాబాద్‌లో ఐదుగురే..

నిర్మల్ అర్బన్, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ముగిసింది. నిర్మల్ జిల్లాలో 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు అధికారులు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కేవలం 1,641 మంది మాత్రమే చేరగా.. గతేడాది 3,661 మంది చేరారు. అంటే సగానికిపైగా తగ్గారు. ఉపాధ్యాయులు బడిబాటను నామమాత్రంగా నిర్వహించడంతోనే విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తగ్గిందని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాగా.. 1,641 మంది నూతన ఎన్‌రోల్‌మెంట్‌లో 817 మంది అంగన్‌వాడీల నుంచి సర్కారు బడిలోకి వచ్చారు. ప్రైవేటు పాఠశాలల నుంచి 52 మంది, నేరుగా అడ్మిషన్ పొందిన వారు 187 మంది, ప్రైవేటు పాఠశాల నుంచి 479 మంది చేరారు. డ్రాపౌట్స్ అయిన 12 మంది కూడా పాఠశాలలో చేరారు.

# సమన్వయంతో కృషి చేయాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



జామడలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, జూన్ 25 : మండల సమగ్ర అభివృద్ధి దిశగా సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నీతి అయోగ్ యాస్పిరేషనల్ కార్యక్రమంలో భాగంగా రాజుల్‌గూడలో జిల్లా, మండల శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్య, వైద్య, శిశు సంక్షేమ, ఇందిరా క్రాంతి, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖ అంశాలపై సమీక్షించారు. ప్రజలకు అందుతున్న సేవలతోపాటు ప్రభుత్వపరంగా చేపడుతున్న ప్రగతిపై సంబంధిత శాఖ అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతి అయోగ్‌కు నార్నూర్ మండలం ఎంపికైన విషయం విధితమే. వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో వ్యాధుల నివారణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలని, రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన బడుల్లో నాణ్యమైన పనులు చేపట్టేలా చూడాలని సమగ్ర గిరిజన సంక్షేమశాఖలోని ఇంజినీరింగ్‌శాఖ అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థికి యూనిఫాం అందించేలా చూడాలని, బట్టల కొరత లేకుండా చూడాలని డీఆర్డీవో సాయన్నకు ఆదేశించారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని వ్యవసాయ అధికారి గిత్తే రమేశ్‌ను ఆదేశించారు. నీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులు వారానికి ఒక్కసారైన మండలంలో పర్యటించాలని సూచించారు. అంతకుముందు మండలంలోని జామడ గ్రామాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఫలాలు, ఆట సామగ్రి, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐటీడీఏ ఈఈ భీంరావ్, తహసీల్దార్ జాడి రాజలింగం, ఎంపీడీవో జవహర్ పాల్గొన్నారు.